ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు

5★★

గురువారం 21 ఆగస్టు 2025



బాధితుడికిఎల్వోసీ అందజేత

జగిత్యాల అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని 44వవార్డుకు చెందిన లియాఖత్ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతుండగా స్థానిక నాయకులు ఫారుఖ్ లియాకత్ ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు వివరించారు. లియాకత్ నిమ్స్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స నిమిత్తం 3లక్షల ఎల్వోసీని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బుధవారం అందించారు. హైదరాబాద్‌లో ఎల్వోసీ అందుకున్న లియాకత్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయాలి

వెల్గటూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయు టీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సెప్టెంబర్1న తలపెట్టిన మహాధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్. నర్సింగం, శ్రీధర్ రెడ్డిలు పిలుపునిచ్చారు. బుధవారం వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో ఎంఈవో ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు నందయ్య చేతుల మీదుగా మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నిండుకుండలా శ్రీరాంసాగర్



ప్రాజెక్టు నుంచి గోదావరిలోకి వదులుతున్న నీరు

- ఆయకట్టు రైతుల్లో ఆనందం
- ఇప్పటికే ప్రాజెక్టు గేట్లు తెరిచి దిగువకు నీరు
- కాకతీయ కాలువ, వరద కాలువలకు పుష్కలంగా నీరు

6

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పద్మావతి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి

జగిత్యాల క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు కార్యాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి లోక్ అదాలత్ విజయవంతంపై న్యాయమూర్తులు, న్యాయవాదులతో ముందస్తు సమావేశం నిర్వహించి మాటాడారు. జగిత్యాల కోర్టు ఆవరణలో సెప్టెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరంచారు. లోక్ అదాలత్‌లో డ్రంకెన్‌డ్రైవ్, ఈ చాలన్లు, సివిల్ తదితర కేసులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో కేసులు ఉన్నాయన్నారు. కక్షిదారులు సకాలంలో అదాలత్ కార్యక్రమానికి హాజరై తమ కేసులను పరిష్కరించుకునేందుకు ఇది చక్కని అవకాశమన్నారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శితో పాటు వివిధ కోర్టుల న్యాయమూర్తులు తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా ఇంటర్ విద్యాధికారి బొప్పరాతి నారాయణ



మాట్లాడుతున్న ఇంటర్ విద్యాధికారి నారాయణ

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అవకాశాలను వినియోగించుకొని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి బొప్పరాతి నారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఇంటర్ విద్యాధికారి నారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఇంటర్ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ శనివారం కళాశాలలో నిర్వహిస్తున్న విద్యా, వైజ్ఞానిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని స్టేజిఫియర్ తొలగించుకోవాలన్నారు. క్రీడా కార్యక్రమాల నిర్వహణ కొరకు అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ. 10వేల చొప్పున మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మక్సూద్, అధ్యాపకులు కొట్టాల తిరుపతి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ బీఎస్ లత



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను, రికార్డుల ను పరిశీలించి తగు సూచనలు చేశారు. మం డలంలోని అమ్మకపేట, వర్షకొండ గ్రామాలలో ఒకే సర్వే నెంబర్‌తో గల భూమి వేర్వేరు విస్తీ ర్ణాలతో ఉన్నట్లు గుర్తించామని, సర్వేయర్లతో సర్వే చేయించి సమస్యను పరిష్కరిస్తామ న్నారు. ఆమె వెంట మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ ఉన్నారు.

ఫసల్ బీమా లేనట్లే..!



- వర్షంతో పంట నష్టం వాటిల్లితే దేవుడి మీదే భారం
- జిల్లాలో 3.5 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వానాకాలం సాగు సీజన్‌లోనూ ఫసల్ బీమా పథకం అమలు అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. గత యేడాది నుంచి ఊరిస్తున్న ప్రభుత్వం ఈ సీజన్‌లోనూ పంటల సాగుకు అదును దాటుతున్నా పట్టించుకోవడం లేదు. ఈ సీజన్‌లో రైతుకు పంట నష్టం జరిగితే దేవుడే దిక్కు అనే దుస్థితి నెలకొంది. జగిత్యాల జిల్లాలో వానాకాలం సీజన్‌లో 4.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారన్న అంచనా వేయగా ఇప్పటి వరకు 3,50,000 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. గతంలో పంటలకు నష్టం వాటిల్లినప్పుడు ఫసల్ బీమా పథకం అమలు చేసే వారు. వానాకాలంలో సాగు చేసే ఆహార పంటలు, నూనె గింజలు, వాణిజ్య, ఉద్యాన పంటలకు పంటల వారీగా, ప్రాంతాల వారీగా ప్రీమియం నిర్దేశించారు. అగ్ని ప్రమాదం, పిడుగుపాటు, గాలివాన, వడగళ్లు, తుఫాను, అనావృష్టి, అతివృష్టి, వరదలు, నీట మునిగిపోవడం, తెగుళ్లు, ప్రతికూల వాతావరణం వల్ల దిగుబడులకు నష్టం వాటిల్లితే పరిహారం చెల్లించేవారు. అంతేగాకుండా ప్రతికూల వాతావరణం వల్ల రైతులు విత్తనాలు విత్తకపోవడం, నార్లు వేయకపోవడం వల్ల కలిగి ఆర్థిక నష్టాలకు బీమా మొత్తంలో 25శాతం వరకు సత్వర నష్టపరిహారం అందించే అవకాశం ఈ పథకంలో ఉండేది. పంట మధ్య కాలంలో నష్టపోయిన రైతులకు సైతం నష్టాన్ని అంచనా వేసి పరిహారంలో పాతిక శాతం చెల్లించే అవకాశం ఉండేది. పంటల రకాలను బట్టి ప్రీమియం చెల్లించేవారు.

- అన్నదాతల ఆశలపై నీళ్లు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఫసల్ బీమా పథకం అమలు అయ్యేది. కానీ వివిధ కారణాలతో కొన్నేళ్లుగా ఈ పథకం నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించడానికి నిర్ణయించిందని పలువురు ప్రజాప్రతినిధులు అనేక సందర్భాల్లో వెల్లడించారు. కానీ రైతుల ఆశపై నీళ్లు చల్లినట్లే కనబడుతోంది. ఈసారి వానాకాలం ఆరంభం నుంచి ఇప్పటి వరకు జగిత్యాల జిల్లాలో భారీ వర్షమే నమోదు కాలేదు. జిల్లాలోని పలు మండలాల్లో లోటు వర్షపాతం నెలకొంది. జిల్లాలో 2.41 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి చేశారు. సరియైన నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పసుపు, మొక్కజొన్న రైతుల పరిస్థితి అలాగే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఫసల్ బీమా అమల్లోకి వచ్చినట్లయితే..

- మిగతా 8లో

విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో రాణించాలి

-జిల్లా విద్యాధికారి రాము



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈవో రాము

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల విద్యా శాఖ విభాగంలో జిల్లా సత్య సాయి సేవా సమితి నిర్వాహకులతో కలిసి రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు 2025 పోటీలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. వచ్చే నెల 10వ తేదీన పోటీలు జరుగనున్నాయన్నారు. 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు పాఠశాలలో కృతజ్ఞత-పరిపూర్ణ జీవనమునకు మార్గం అను అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో మొదటి ముగ్గురు విజేతలకు ప్రశంసాపత్రములు, బహుమతులు అందిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా సత్య సాయి సేవా సమితి అధ్యక్షుడు ర్యాగెళ్ల వెలయేలేశ్వర్, వాసాల శేష శయన, వాసాల శరత్ చంద్ర, బట్టు రాజేందర్, అర్వపల్లి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

-మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



బాధిత కుటుంబ సభ్యులను పరార్శిస్తున్న మంత్రి అడ్లూరి, నాయకులు

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో ఇటీవల వరదల్లో గల్లంతయిన జగిత్యాలకు చెందిన ముగ్గురు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డిలు అన్నారు. బుధవారం పట్టణంలోని 47వ, 48వ వార్డు తారకరామ నగర్‌లో హసీనా, సమీనా, ఆఫ్రీన్ నివాసాలను సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును, కుటుంబ, ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి బాధిత కుటుంబాలకు సహాయం అందే విధంగా సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మోతాదు మించి ఎరువులు వాడొద్దు'

భీమారం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగులో మోతాదు మించి ఎరువులు వాడొద్దని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. భీమారం మండల కేంద్రంలో రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎరువుల మోతాదు, సమయానుకూలంగా ఎరువుల వాడకం గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎండీ షాహిద్ అలీ, రైతులు పాల్గొన్నారు.

కాళేశ్వరం దోపిడీ బయటపడుతుందనే హైకోర్టులో పిటిషన్లు

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ధర్మపురిలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో దోచుకున్నది బయటపడుతుందనే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీ‌ష్‌రావు జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌పై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ పిటిషన్లు దాఖలు చేశారని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. ధర్మపురి పట్టణంలో బుధవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విలేక రులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్లక్ష్యం, అక్రమాలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక అక్రమమని కేసీఆర్, హరీ‌ష్‌రావు మాట్లాడడం సరికాదన్నారు. అసెంబ్లీలో కాళేశ్వరంపై కమిషన్ ఇచ్చిన నివేదికపై చర్చిస్తే బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందనే భయం వారికి పట్టుకుందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం అంశంపై ఏనాడైనా చర్చ పెట్టారా అని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కమీషన్లతో రాష్ట్ర ఆర్థికవ్యవస్థను కేసీఆర్ కుటుంబం ఛిన్నాభిన్నం చేసిందని మంత్రి అడ్లూరి విమర్శించారు. ఆయనవెంట టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్ ,తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



సమావేశంలో మాట్లాడుతున్న దావ వసంత

జగిత్యాల క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) :ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో బుధవారం వసంత విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాటినుంచి 60వేల ఉద్యోగాలు ప్రకటించామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ల వివరాలతో కూడిన శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా నేటికి జాబ్ క్యాలెండర్ విడుదల చేయక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. మన ఊరు-మన బడులకు సం బంధించిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు ఉప ముఖ్యమంత్రి చాంబర్ ఎదుట నిరసన తెలిపినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఆనందరావు, మహిపాల్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, తిరుపతి, హరీష్ తదితరులు ఉన్నారు.

నేడు అర్బన్ కాలనీలో ఆసుపత్రి ప్రారంభం

జగిత్యాల అర్బన్, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని నూకపెల్లి అర్బన్ కాలనీలో ఆసుపత్రిని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం ప్రారంభించనున్నారు. అర్బన్ కాలనీలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు. ఎమ్మెల్యే ఆసుపత్రి, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను శాశ్వతంగా ఏర్పాటు చేయడానికి ఆలస్యం అవుతుండడంతో అర్బన్ కాలనీలోని రోడ్‌నంబర్ 28 బ్లాక్ నంబర్ 280 ప్లాట్ నంబర్ 12 లలో బస్తీ దవాఖానా, రోడ్ నంబర్ 27 బ్లాక్ నంబర్ 279 ప్లాట్ నంబర్ 4లో అంగన్‌వాడీ సెంటర్, రోడ్ నంబర్ 27 బ్లాక్ నంబర్ 279 ప్లాట్ నంబర్ 1, 2, 3 లలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయనుండగా ఎమ్మెల్యే వాటిని బుధవారం ప్రారంభించనున్నారు.

ప్రీ ప్రైమరీ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో 51 ప్రైమరీ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం



ధర్మపురిలో మెట్లను ఆనుకొని ప్రవహిస్తున్న గోదావరి

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గోదావరి పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కడెం ప్రాజెక్టులకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో ఎప్పటి కప్పుడు మిగులు జలాలను దిగు వకు విడుదల చేస్తున్నారు. దీంతో మూడు రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 52,850 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 45,697 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇటీవల ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి వద్ద గోదావరి ఉధృతిని కలెక్టర్ సత్య ప్రసాద్ పరిశీలించారు.

జిల్లాలోని ఎర్దండి వద్ద ప్రవేశించిన గోదావరి ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి నుంచి మల్లాపూర్ మండలం మొగిలిపేట, వేంపల్లి వెంకట్రావుపేట రాయికల్, బీర్‌పూర్ మండలం కమ్మునూర్, ధర్మపురి, వెల్గటూరు మండలం కోటిలింగాల గ్రామాల వెంట ప్రవహిస్తోంది. గోదావరి ఉధృతంగా పారుతుండడంతో అటువైపు మత్స్యకారులు, గొర్ల కాపరులు, ప్రజలు రావద్దని అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

జగిత్యాల క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) :మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి కరుణాకర్ మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. రాయికల్ ఎస్సై సుదీర్‌రావు తన సిబ్బందితో బుధవారం వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం హనుమాండ్ల పల్లికి చెందిన ఆవుల సంతోష్ అనే వ్యక్తి అతిగా మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ పడ్డుబడ్డాడు. డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుచగా జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ అవార్డు గ్రహీత కాయితి శంకర్‌ను విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి కేశవరాజు బుధవారం జగిత్యాల పట్టణంలోని మాధవ నిలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేశవరాజు మాట్లాడుతూ సమాజంలో నిస్వార్థంగా పేదలకు సేవ చేసినపుడే తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కిడ్నాప్ అయిన వృద్ధురాలి హత్య



పెగుడ మల్లవ్వ(ఫైల్)

గంగాధర/గంభీరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కిడ్నాపైన గంగాధర మండల కేంద్రానికి చెందిన పెగుడమల్లవ్వ(70)ను దుండగులు హత్య చేశారు. ఎస్సై వంశీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల16న మల్లవ్వను ఇంటి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. మరుసటి రోజున మల్లవ్వ తమ్ముడు ఈరవేణి రాయమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్‌కు చెందిన గంగరాజు మల్లవ్వను కిడ్నాప్ చేయాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా కొత్తపల్లి మండలం మల్కాపూర్‌కు చెందిన దేవునూరి సతీష్, దేవునూరి శ్రావణ్ గంగరాజు సూచనల మేరకు ఈనెల 16న మల్లవ్వను కారులో ఎక్కించుకుని కిడ్నాప్‌చేశారు. మల్లవ్వను గంభీరావుపేట మండలశివారులోని పెద్దమ్మ స్టేజివద్ద అడవిలో హత్యచేసి ఆమెపైన ఉన్న బంగారు ఆభరణాలు, నగదును దోచుకుని మృతదేహాన్ని చెత్త కుప్పలో పడేశారు. మల్లవ్వను కిడ్నాప్ చేసే సమయంలో కారు నంబర్‌కనిపించకుండా స్టిక్కర్లు అతికించి దుండగులు జాగ్రత్తపడ్డారు. నిందితుల సెల్‌ఫోన్‌లను ట్రాప్‌చేసి పట్టుకోగా హత్యానేరాన్ని ఒప్పుకున్నారు. హత్యకు సంబంధించి ప్రధాన నిందితుడైన గంగరాజుతోపాటు మరికొందరు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు వేవునూరి శ్రావణ్‌పై గతంలో కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో గంజాయి, కొట్లాట కేసులు ఉన్నాయి. ఇద్దరు నిందితుల వద్ద నుంచి రెండుసెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమా వేశంలో కరీంనగర్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సీఐ ప్రదీప్ కుమార్, ఎస్సై వంశీకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్‌పత్తి ధరరూ.7600 పలికింది. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు 18క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7600 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

మహారాష్ట్ర వరదలో చిక్కుకున్న గోదావరిఖని వాసులు

కోల్‌సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికిచెందిన మామిడి కుమార్ కుటుంబం మహారాష్ట్ర వరదల్లో చిక్కుకుంది. మందమర్రి, మంచిర్యాలకు చెందిన నలుగురుమిత్రుల కుటుంబాలు, కుమార్ కుటుంబం మినీ బస్సులో కర్ణాటక, మహారాష్ట్ర టూర్‌కు వెళ్లారు. ఈనెల11న కర్ణాటకకు వెళ్లిన వీరు 18నగోవా నుంచి బయలు దేరి మహారాష్ట్రకు చేరుకున్నారు. కొల్హాపూర్ సమీపంలోని గగన్‌భవాడివద్ద వరద తీవ్రతకు మంగళవారం నుంచి వాహనాలు నిలిచిపోయాయి. మూడురోజులుగా భారీవర్షాలు కురుస్తుండడంతో పోలీసులు వాహనాలు నిలిపివేశారు. దీంతో మంచిర్యాల జిల్లాకు చెందిన వారు సెల్ఫీవీడియో ద్వారా ప్రభుత్వ యంత్రానికి విన్నవించారు. వారిని మంగళవారం రాత్రి చిన్నషెడ్‌లో ఉంచిన పోలీసులు బుధవారం ఇతర మార్గాలనుంచి పంపించే యత్నం చేయగా మళ్లీ బస్సు వరదలో చిక్కుకున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. వరదలు తగ్గితే కానీ పంపించే అవకాశం లేదని పోలీసులు పేర్కొంటున్నట్టు తెలిపారు.

వినాయక విగ్రహాన్ని తాకిన విద్యుత్ తీగలు

● రోడ్డుపైనే అరగంట ఆగిన వాహనం



విద్యుత్ తీగలు అడ్డు రావడంతో ఆగిన ట్రాక్టర్

ఎండపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండగా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామంలో జాతీయ రహదారిపై ఉన్న విద్యుత్ తీగలు తాకడంతో రోడ్డుపైనే ట్రాక్టర్ అరగంట పాటు ఆగింది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన యూత్ సభ్యులు కోరుట్ల నుంచి వినాయకుడిని ట్రాక్టర్‌పై స్వగ్రామానికి తీసుకెళ్తున్నారు. ఈక్రమంలో కొత్తపేట రహదారిపై వినాయక విగ్రహానికి తీగలు తట్టడాన్ని గమనించిన యూత్ సభ్యులు అప్రమత్తమై వాహనాన్ని అక్కడే ఆపి విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో విద్యుత్ సిబ్బంది కరెంట్ ఎల్‌సీ తీసుకోవడంతో ట్రాక్టర్ ముందుకు కదిలింది. వినాయక నిమ జ్జనం నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు ముందస్తుగా స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిండుకుండలా శ్రీరాంసాగర్



● ప్రస్తుత పరిస్థితి ఇలా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 2,07,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 68.065 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 1,31,867 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 25 వరద గేట్ల ద్వారా 1,02,850 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,000 క్యూసెక్కులు, వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 636 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

- ఆయకట్టు రైతుల్లో ఆనందం
- ఇప్పటికే ప్రాజెక్టు గేట్లు తెరిచి దిగువకు నీరు
- కాకతీయ కాలువ, వరద కాలువలకు పుష్కలంగా నీరు

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టుకు చెందిన గేట్లను పైకి ఎత్తి దిగువ గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. కాకతీయ కాలువ, వరద కాలువలకు పుష్కలంగా నీరు విడుదల చేస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో సాగు, తాగు నీటికి ఇబ్బందులు దూరం కానున్నయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో రైతులు, మత్స్యకారుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతమైన మహారాష్ట్ర నుంచి అధికంగా వరద నీరు వచ్చి చేరుతోంది.

● మరమ్మతులకు నోచుకోని కాలువలు

కాకతీయ ప్రధాన కాలువ లైనింగ్ పలు ప్రాంతాల్లో పగుళ్ల తేలింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, బీమారం, జగిత్యాల రూరల్, మల్యాల, కొడిమ్యాల మండలాల్లో ప్రవహించే ఈ కాలువలో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం శ్రీరాంసాగర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో వానాకాలంతో పాటు యాసంగిలోనూ పంటలు సాగయ్యే అవకాశాలున్నాయి. కాకతీయ కాలువ ఉప కాలువలకు తాత్కాలిక మరమ్మతులు చేయకపోవడంతో చివరి ఆయకట్టు వరకు నీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. పలు ప్రాంతాల్లో కాలువ లైనింగ్ దెబ్బతినడం, పిచ్చి మొక్కలు పెరగడం, పూడికతీత చేపట్టకపోవడం వంటి సమస్యలున్నాయి. ఎస్సారెస్పీలో పుష్కలంగా నీరు ఉండడంతో జగిత్యాల జిల్లాలోని గోదావరి తీరంలో ఉన్న ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్ తదితర మండలాల్లో గల ఎత్తిపోతల పథకాల కింద సాగయ్యే పంటలకు నీరందే అవకాశం ఉంది.

● సాగు, తాగు నీటి కష్టాలు తీరినట్లే..

ప్రస్తుత యేడాది జూన్ ఒకటో తేదీ నుంచి ఈనెల 19వ తేదీ ఉదయం 6 గంటల వరకు 82.683 టీఎంసీల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. ప్రాజెక్టులో అవసరాల మేరకు నిల్వ చేసి మిగులు నీటిని సుమారు 22.026 టీఎంసీలను సాగునీటి కాలువలు, గోదావరి నది దిగువకు వదిలారు. ఈనెల రెండో తేదీ నుంచి ఐదో తేదీ వరకు వరద గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈనెల 17 నుంచి మిగులు నీటి విడుదల జరుగుతోంది. ప్రాజెక్టు కింద కాకతీయ, సరస్వతీ, లక్ష్మీ, వరద కాలువలతో పాటు ఎత్తిపోతల పథకాల కింద సుమారు 7.5 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నారు.



కాకతీయ కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

● వరద కాలువ, కాకతీయ కాలువల ద్వారా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద పెరుగుతుండడంతో వరద కాలువ, కాకతీయ కాలువ ద్వారా అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. వరద కాలువకు మొదట రెండు వేల క్యూసెక్కుల నుంచి పెంచి చివరకు 20 వేల క్యూసెక్కుల నీటి విడుదల పెంచి వదులుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా 4 వేల నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పాముకాటుతో రైతు మృతి



రమేష్(ఫైల్)

చిగురుమామిడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరి గ్రామా నికి చెందిన మేడబోయిన రమేష్ (40) అనే యువ రైతు తన వ్యవసాయబావి వద్ద మంగళవారం ఉదయం పాముకాటుతో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రోజువారి కార్యక్రమంలో భాగంగా రమేష్ వ్యవసాయ పనులు చేసేం దుకు ఉదయం పొలం గట్టుపైనుంచి నడుస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పటికే పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామమాజీ ఎంపీటీసీ తిరుపతి తెలిపారు.

మహిళను కాటు వేసిన పాము

శంకరపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామంలో మహిళ పాము కాటుకు గురైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్కండ్ల గ్రామానికి చెందిన చర్ల రేణుక తన భర్త కోటయ్యతో కలిసి వ్యవసాయ పొలంలో వరికలుపు తీస్తోంది. ఈక్రమంలో అకస్మాత్తుగా పాము వచ్చి ఆమె చేయిపై కాటేసింది. గమనించిన కోటయ్య వెంటనే 108కు సమాచారం అందించారు. 108 వాహనం సిబ్బంది తక్షణమే అక్కడికి చేరుకొని రేణుకకు ప్రథమచికిత్స అందిస్తూ కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారు టైర్లు ఎత్తుకెళ్లిన దుండగులు

తిమ్మాపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ స్టేజి సమీపంలో ఈనెల18న రాత్రి ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న విషయం విదితమే. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా రోడ్డు పక్కకు పెట్టించారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు ఆ కారుకు సంబంధించి ముందు, వెనకల ఉన్న నాలుగు టైర్లను దొంగిలించుకొని పోయారు. దీన్ని స్థానికులు చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. కారు టైర్లు ఎత్తుకెళ్లిన దుండగులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాటర్ ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకుంటాం

● మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్



వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేయిస్తున్న కమిషనర్ మహమ్మద్ అయాజ్

జమ్మికుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వాటర్‌ప్లాంట్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని ఓ వాటర్ ప్లాంట్‌ను అధికారులతోకలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాటర్‌ప్లాంట్ అపరిశుభ్రంగా ఉండటం, క్యాన్లలోపురుగులు ఉండటాన్ని గమనించి ఆగ్రహంవ్యక్తం చేసి సీజ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాటర్ ప్లాంట్లలోని క్యాన్లను మూడు నెలలకు ఒకసారి మార్చాలన్నారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. మున్సిపల్ పరిధిలో 25 వాటర్ ప్లాంట్లు ఉన్నాయని, విడుతల వారీగా అన్నింటినీ తనిఖీ చేస్తామన్నారు.

● గణేష్ స్టోర్స్‌కు జరిమానా..

జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్‌లో గల గణేష్ జనరల్‌స్టోర్స్‌ను మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేశారు. అల్లం పేస్ట్ డబ్బాలపై ఎలాంటి స్టిక్కర్లు లేకపోవడాన్ని గమనించి మందలించారు. బ్యాన్ అయిన ప్లాస్టిక్ కవర్లు విక్రయించడంపై జరిమానా విధించారు. మరోసారి ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి సోదరుడు రాజేశం మృతి



రోదిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు (చిన్న అన్నయ్య) కవ్వంపల్లి రాజేశం బుధవారం మృతిచెందారు. ఆంధ్ర బ్యాంకులో ఉద్యోగం చేసిన కవ్వంపల్లి రాజేశం ఏడేళ్ల కిందట ఉద్యోగవిరమణ పొందారు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో 20 రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. వైద్యుల సూచన మేరకు చివరి దశలో కరీంనగర్‌లోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఇతర నాయకులు పరామర్శించారు. కవ్వంపల్లి రాజేశం అంతిమ యాత్రలో జిల్లాకు చెందిన పలువురు ముఖ్యనేతలు, మానకొండూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు మార్కెట్ కమిటీ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగం కల్పించేలా విద్యార్థులు ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్

రామగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం సాధించేవిధంగా కాకుండా పలువురికి ఉద్యోగం కల్పించే లక్ష్యంతో విద్యార్థులు ఎదగాలని జెఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ కిషన్‌కుమార్‌రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా(అలీప్)ఆధ్వర్యంలో ప్రపంచబ్యాంకు నిధులతో భారతప్రభుత్వం నిర్వ హిస్తున్న రైజింగ్ అండ్ యాక్సలరేటింగ్ అండ్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహాపరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ)స్థాపనలో భాగంగా తెలంగాణప్రభుత్వం పరిశ్రమలశాఖ, జిల్లా గ్రామీణఅభివృద్ధిసంస్థ సంయుక్తంగా మంథని జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ ప్రొఫెసర్ ఆర్ శ్రీదేవి నేతృత్వంలో జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో యువ అంకుర సంస్థలకు, ఔత్సాహికులకు అవగాహన కల్పించారు. యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కిషన్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసదస్సుకు హాజరైన250మంది విద్యార్థులకు 15రోజులపాటు స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, ప్రభుత్వం ఫడింగ్ స్కీంల, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అలీప్ డైరెక్టర్ కన్నెంటి రమాదేవి, చీఫ్ ఇన్నోవేషన్ అధికారి డాక్టర్ జహరుల్లా, వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్,మేనేజర్ నవీన్‌కృష్ణసాజీద్,వంశీ,కావ్యతదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్క్రాప్ బస్సును ఢీకొన్న లారీ

తిమ్మాపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణకాలనీ వద్ద రాజీవ్ రహదారి వద్ద నిలిపి ఉంచిన ఆర్టీసీస్క్రాప్ బస్సు(పాడైన, పనికి రాని)ను లారీ ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కిచెందిన వారు స్క్రాప్‌లో 4 ఆర్టీసీబస్సులను కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకెళుతున్నారు. ఒకస్క్రాప్ బస్సు డ్రైవర్ రామకృష్ణ కాలనీ వద్ద బుధవారం తెల్లవారుజామున రోడ్డు పక్కన టీ తాగేందుకు ఆపాడు. ఈ క్రమంలో కరీంనగర్ వైపు నుంచి హైదారాబాద్ వైపునకు వెళుతున్న లారీ, బస్సును ఢీ కొంది. దీంతో బస్సు రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకువెళ్లింది. బస్సు డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

వరకట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య



భావన(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భర్తతో పాటు అత్తింటివారి వరకట్నం వేధింపులు భరించలేక కరీంనగర్‌లో నివాసం ఉంటున్న కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేటకు చెందిన భావన అలియాస్ మానస(26)మంగళవారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి, పోలీసులవివరాల ప్రకారం.. సోమార్‌పేటకు చెందిన భావన అలియాస్ మానసకు గాంధారి మండలం పేట్‌సంగెం గ్రామానికి చెందిన అబ్రం జ్ఞానేశ్వర్‌తో 2023నవంబరులో వివాహమైంది. వీరికి 6నెలల కూతురు ఉంది. వివాహసమయంలో 16తులాల బంగారం, లక్ష రూపాయల నగదు, ఇతరలాంఛనాలు అత్తింటివారికి ముట్టజెప్పారు. అబ్రం జ్ఞానేశ్వర్ కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో కెప్టెన్‌గా పనిచేస్తూ భార్య, కూతురుతో కలిసి స్థానిక భగత్‌నగర్‌లో అద్దెఇంటిలో ఉంటున్నాడు. ఏడాది నుంచి భర్త, అత్త, మామ, ఆడపడుచులు అదనపుకట్నం తేవాలంటూ భావనను మానసికంగా వేధిస్తున్నారు. తండ్రి ఆస్తిలో 3వ వంతు తేవాలని వేధించేవారు. ఈ విషయాన్ని తరచూ భావన తన తండ్రి,తల్లి వద్ద చెప్పు కుంటూ బాధపడుతుండేది. ఈ బాధలు తాళలేక తన కూతురు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని తండ్రి క్యాస కిష్టయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. భర్త జ్ఞానేశ్వర్ హోటల్‌లో విధులు ముగించుకొని అర్ధ రాత్రి 12గంటలకు ఇంటికి వెళ్లేసరికి భావన ఉరికి వేళాడుతూ కనిపించింది. కరీంనగర్ ఏసీపీ వెంకటస్వామి, సీఐ రాంచందర్‌రావు సంఘటనస్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఫోరెన్సిక్ నిపుణులతో తనిఖీ చేయించినట్లు, భర్త, అత్త, మామ, ఆడపడుచులపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

భార్యాపిల్లల బాగోగులు చూడని ఉద్యోగి సస్పెన్షన్

● ఉత్తర్వులు జారీ చేసిన పెద్దపల్లి కలెక్టర్

పెద్దపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తరచుగా గృహహింసకు పాల్పడుతూ భార్యాపిల్లల బాగోగులు పట్టించుకోని ప్రభుత్వ ఉద్యోగిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ బుధవారం పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఓదెల ప్రాథమికఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న కె రవీందర్ తమ పోషణను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆయన భార్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో స్థానిక సఖికేంద్రం సిబ్బంది భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించడానికి ప్రయత్నించగా రవీందర్ సహకరించ లేదన్నారు. గృహహింస నిరోధక చట్టం ప్రకారం మరోసారి జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ నోటీసులు జారీ చేసినప్పటికీ రవీందర్ కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు కలెక్టర్‌కు నివేదిక అందించారు. ప్రభుత్వ ఉద్యోగుల పరివర్తన నియమావళి ప్రకారం భార్యపిల్లల పోషణను నిర్లక్ష్యం చేస్తున్న ఫార్మాసిస్టు కె రవీందర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

తిమ్మాపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామశివారులో ఉన్న ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఎల్లమ్మ విగ్రహంపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. వాటి విలువ సుమారు 20వేల వరకు ఉంటుందన్నారు. ఈ మధ్య మండలంలో చాలా గ్రామాల్లోని ఆలయాల్లో వరుస చోరీలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై దృష్టి

- ఇన్‌చార్జి మంత్రి తుమ్మల అధ్యక్షతన హైదరాబాద్‌లో సమావేశం
- ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టిసారించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనాయకులతో ఉన్నతస్థాయి సమీక్షా సమా వేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో బుధవారం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పలు అంశాలపై సమీక్షించారు. యువతకు ఉపాధి అవ కాశాలు కల్పించే విషయంలో చిన్న, మధ్యతరహ పరిశ్రమలకు ప్రోత్సాహం అందించే విషయంలో అందరూ దృష్టిసారించాలన్నారు. రైతు బజార్లను విస్తరించాలని, ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టిని సారించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని తెలిపారు.

● పార్టీని బలోపేతం చేయాలి..

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలోనే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రధానంగా గ్రామ, మండల స్థాయిల్లో పార్టీని బలోపేతం చేయాలని, వారి ద్వారా ప్రజల సమస్యలనుతెలుసుకొని పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల జిల్లా మంత్రులను, ఎమ్మెల్యేలను, నియోజకవర్గాల ఇన్‌చార్జిలకు సూచించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తమ తమ నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి ఆ సమాచారాన్ని ఇన్‌చార్జి మంత్రికి అందజేశారు. సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని వివరిస్తూ ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకో వాల్సిన చర్యల గురించి ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువచ్చారని సమాచారం.

ప్రధానంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు, విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, పంట నష్టపరి హారం అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఇన్‌చార్జి మంత్రి తుమ్మల సూచించినట్లు తెలిసింది. త్వరలోనే ఇరిగేషన్, రోడ్లు, భవనాలశాఖ మంత్రులతో కలిసి ఆయాశాఖల ప్రత్యేకసమీక్షా సమావేశాలను నిర్వహిస్తామన్నారు. దీనిద్వారా ఉమ్మడిజిల్లా పరిధిలో ఉన్న అన్ని సాగునీటి సమస్యలు, రోడ్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తుమ్మల ప్రజాప్రతినిధులకు వివరించారు.

● 'కరీంనగర్'పై చర్చ

ఈ సందర్భంగా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి నియామక విషయం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్ కరీంనగర్ ఇన్‌చార్జిని నియమించకపోవడంతో జిల్లా కేంద్రంలో పార్టీ బలహీనపడుతోందని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీని ప్రభావం పెద్దపల్లి, చొప్పదండితో పాటు సమీప నియోజకవర్గాలపై పడుతున్నదని, వెంటనే ఈ సమస్యను పరిష్కరిం చాలని కోరినట్లు తెలిసింది. మంత్రి శ్రీధర్‌బాబు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని సమాచారం. వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, గత ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు ఒక్క డివిజన్‌ను కూడా గెల్చుకోలేకపోయామని, అలాగే 26 గ్రామాల్లో కూడా స్థానిక ప్రజాప్రతినిధులను గెలిపించు కోలేక పోయామని తెలిపారు. కరీంనగర్‌లో పార్టీ పరిస్థితి ప్రస్తుతం ఆశాజనకంగా లేదని, నియోజకవర్గ ఇన్‌చార్జిని నియామకంలో జాప్యం చేస్తే పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చని మంత్రి తుమ్మలకు వివరించారని తెలిసింది. దీంతో వెంటనే కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిని నియమించాలనే అభిప్రాయానికి మంత్రులు వచ్చినట్లు సమాచారం. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ భానుప్రసాద్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, విజయరమణారావు, రాజ్‌ఠాకూర్, డాక్టర్ సంజయ్ కుమార్, నియోజకవర్గ ఇంచార్జిలు వొడితెల ప్రణవ్, జువ్వాడి నర్సింగరావు, కేకే మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, వి నరేందర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఐటీఐలో కొత్త కోర్సులతో ఉద్యోగాలు

● హైదరాబాద్‌కు వెళ్లిన విద్యార్థులు



పెద్దపల్లి రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న యువకులు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలో గల ప్రభుత్వ ఐటిఐలో టాటా కంపెనీ నూతనంగా తీసుక వచ్చిన కోర్సులతో ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఆయా కోర్సులు చదివిన నిరుద్యోగులకు హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగాలు రావడంతో బుధవారం పెద్దపల్లి రైల్వేస్టేషన్ నుంచి పలువురు హైదరాబాద్‌కు వెళ్లారు. పెద్దపల్లి ఐటిఐలో టాటా కంపెనీ మ్యాను ఫ్యాక్చరింగ్‌లో ఏడాది కోర్స్‌ను ప్రవేశపెట్టింది. ఈ కోర్సును పలువురు విద్యార్థులు అభ్యసించారు. ఇటీవల కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూ లకు వారు హాజరు కావడంతో చాలామందికి ఉద్యోగం కల్పిస్తూ అపాయింట్ మెంట్ లెటర్లు అందాయి. దీంతో వారు హైదరాబాద్‌లోని తుక్కుగూడలోని ఇన్ఫోసిస్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐలో చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా లభిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో సాయి రోహిత్ గౌడ్, సుమిత్, ఆదిత్య, ముఖేష్, పి సాయి కిరణ్, ఎ సాయి కిరణ్, ఫరాజ్, నితిన్, ఎ శివమణి, అబి, శివకుమార్, యశ్వంత్, అభిలాష్, రేవంత్ తదితరులు ఉన్నారు.

తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలకు ఉమ్మడి జిల్లా వాసులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో కృషి చేస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 48 మందిని తెలుగు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కారాలతో సత్కరించనుంది. ఈ క్రమంలో విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానంద రావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఆయారంగాలకు చెందిన ప్రముఖులను ఎంపిక చేసి జాబితా విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఐదుగురు ఎంపికవడం విశేషం. ఎంపికైన వారిలో ఎస్.రఘువర్మ (అనువాదరంగం-జగిత్యాల), మంగారి హిమజ (రచనారంగం-వేములవాడ), పిన్నంశెట్టి కిషన్ (కథారంగం -వేములవాడ), రతన్‌కుమార్ (పేరిణినృత్యం-కరీంనగర్), పాతూరి మహేందర్‌రెడ్డి (ఉపాధ్యాయరంగం-రాజన్నసిరిసిల్ల) ఉన్నారు. వీరికి తెలుగు విశ్వవిద్యాలయం-నాంపల్లి ప్రాంగణంలో రూ.5,116 చొప్పున నగదుతో కూడిన పురస్కారం అందజేయనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు.

కనుమరుగవుతున్న జానపద కళలు



ఒగ్గుడోలు, బోనాల కళాకారులు (ఫైల్)

● ఆదుకోవాలంటున్న కళాకారులు
● రేపు అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే విశిష్ట సంప్రదాయానికి సజీవ సాక్ష్యమైన జానపద కళలు కనుమరుగవుతున్నాయి. కళనే నమ్ముకున్న వేలాది మంది కళాకారులు రోడ్డున పడుతున్నారు. కళలు వెలుగులోకి రావడం లేదు. కళాకారులకు పొట్ట గడవని దుస్థితి ఏర్పడింది. ఆధునికత, ప్రపంచీకరణ, సామాజిక మార్పులు, పాశ్చాత్య సంస్కృతి ప్రభావం కళలను దెబ్బతీశాయి. 22న అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం సందర్భంగా ఓ కథనం.



గొల్ల సుద్దులు కళారూపం (ఫైల్)

నేపథ్యం..

1926లో అమెరికాలో హెన్నీ హెరాల్డ్ లూయిస్ ఆయా దేశాల, ప్రాంతాల కళలకు ప్రాచుర్యం లభించేందుకు జానపద కళల దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించారు. ఈ క్రమంలో యేటా ఆగస్టు 22న ఈ దినోత్సవం జరుపుకుంటారు.

జిల్లాలో జానపద కళల స్థితి..

ఉమ్మడి జిల్లాలో దాదాపు ఆరు వేల మంది జానపద కళాకారులున్నారు. కొందరు కళనే వృత్తిగా చేసుకొని జీవనోపాధి పొందుతుంటే మరికొందరు పూట గడవని స్థితిలో ఉన్నారు. మిద్దెరాములు, గోపాల్‌రాజ్ భట్టు, గోలి రాజగోపాల్‌రెడ్డి, రతన్‌సింగ్, వెంకటేశ్ నాయక్, కళాచందర్, జనమంచి రాములు, రజనీశ్రీ, కోడూరి రవీందర్‌గౌడ్ వంటి కళాకారులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. జి కృపాదానం, సంగెం రాధాకృష్ణ, కచ్చు అంజయ్య, దొడ్ల మల్లయ్య, గోపాల్‌రావు, రాజమౌళి, కనకం రమణయ్య, అందాసి నారాయణ, కోడూరి పోచయ్య, ఎండీ ఇస్మాయిల్, తీగల రాజేశం, రాములు, గజవెల్లి వెంకటనరసయ్య వంటి వారు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కళా ప్రదర్శనలిస్తూ జిల్లాకు కీర్తి తీసుకవస్తున్నారు. ఉత్సవాలు, పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంలో తప్ప వీరి ప్రదర్శనలకు వీలు లేకుండా పోయింది. కొందరు పెన్షన్ అందుకుంటున్నా ఆ డబ్బులు సరిపోక గ్రామాలు తిరుగుతూ పొట్ట పోసుకుంటున్నారు. ప్రభుత్వం ఉద్యోగాలిచ్చినా అర్హులైన వారికి ఉద్యోగాలు రాలేదనే విమర్శలు వస్తున్నాయి.

కళాకారుల డిమాండ్లు

- రాష్ట్ర ఆవిర్భావ దినం జూన్ 2ను జానపద కళల దినోత్సవంగా ప్రకటించాలి.
- ప్రతి జిల్లాకు కల్చరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్‌ను నియమించాలి.
- యేటా జానపద కళోత్సవాలు నిర్వహించాలి.
- విశ్వ విద్యాలయాల్లో సర్టిఫికెట్ కోర్సు ప్రవేశపెట్టి సీనియర్ కళాకారులకు, ఔత్సాహికులకు అవకాశం కల్పించాలి.
- అర్హులైన కళాకారులను గుర్తించి ఉద్యోగాలు, ఇళ్లు, పెన్షన్లు, జీవన భృతి అందించాలి. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

మలి దశ ఉద్యమంలో జానపదం...

తెలంగాణ మలి దశ సాంస్కృతికోద్యమంలో జానపద కళలు కీలక పాత్ర పోషించాయి. కళాకారులు తమ కళారూపాలతో నిరసనలు తెలిపారు. ప్రజా చైతన్యం కోసం ఊరూరా ఆటాపాటలతో తిరిగారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తమను పట్టించుకునే వారే లేరని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి జానపద కళోత్సవాల జాడ లేకుండా పోయింది. నూతన ప్రభుత్వం ఏర్పడ్డాకైనా కళాకారులకు సముచిత గుర్తింపు వస్తుందని ఎన్నో ఆశలతో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 400 మందికి పెన్షన్లు వస్తుండగా, జిల్లాలు వేరైన తర్వాత అదనపు కోటా కేటాయించాల్సి ఉంది.



చిరుతల భజన

డప్పు నృత్యం

బుడుబుక్కలవారు



కళలకు ప్రాధాన్యమివ్వాలి..

- గుండ్ర కృపాదానం, జానపద కళాకారుడు

ప్రాచీన జానపద కళలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. కళలు, కళాకారుల గుర్తింపులో ప్రభుత్వం ప్రధాన భూమిక పోషించాలి. పెన్షన్లు అందరికీ అందేలా చూడాలి.



పేద కళాకారులకు న్యాయం చేయాలి...

- కనకం రమణయ్య, జానపద కళాకారుడు

ప్రభుత్వం జానపద కళాకారులను ఆదుకోవాలి. ఉమ్మడి 10 జిల్లాల్లోని కళలను వెలికి తీయాలి. పేద కళాకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలి.



పూర్వ వైభవం తీసుకురావాలి..

- అందాసు నారాయణ, జానపద కళాకారుడు

కళలకు పూర్వ వైభవం తీసుకురావాలి. కవులు, గాయకులు, కళాకారులు ఏకం కావాలి. సృష్టిలో జానపదానికి ముగింపు లేదు. నాయకులను, ప్రజలను చైతన్య పరిచేది జానపదం.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తికి మరింత జాప్యం

● సమీక్ష జరిపిన సీఎండీ శర్వానంద్ ● డెన్మార్క్ నుంచి హల్దర్ టాప్ ఇంజనీర్ రాక

కోల్‌సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో షట్‌డౌన్ అయిన ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి పునరుద్ధరణకు మరింత జాప్యం ఏర్పడే అవకాశం ఉంది. ఈ నెల 24న ఉత్పత్తి ప్రారంభమవుతుందని ప్రాజెక్టు వర్గాలు అంచనాల వేసినా అది సాధ్యపడే పరిస్థితి లేదు. మరో వారం నుంచి పది రోజులు కనీసంగా సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తుంది. ఇప్పటికే టెక్నాలజీ సరఫరా చేసిన డెన్మార్క్‌కు చెందిన హల్దర్ట్ టాప్స్ ఇంజనీర్ ఒకరు రామగుండం చేరుకుని పరిశీలించారు. మరికొన్ని ఏజెన్సీలను సమన్వయం చేసుకుంటేనే మరమ్మతులు జరిగే అవకాశం ఉంది. రెండు నెలల క్రితం వార్షిక మరమ్మతుల సమయంలో కీలకమైన హెచ్‌టీఆర్‌ను బైపాస్ చేశారు. దాన్ని వినియోగించకుండా ఉత్పత్తి ప్రారంభించడం వల్ల ఒత్తిడి పెరిగి అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీ అవుతున్నట్టు తెలుస్తుంది. హెచ్‌టీఆర్‌ను పునరుద్ధరించాలంటే రూ.150కోట్ల నుంచి రూ.200కోట్లు అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో హెచ్‌టీఆర్‌ను పునరుద్ధరించేందుకు ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుం ది.హల్దర్ సంస్థనే హెచ్‌టీఆర్‌ను సమకూర్చాల్సి ఉంటుంది. హెచ్‌టీఆర్‌ను పునరుద్ధరించకుండా మరమ్మతులు చేసినా మళ్లీ సమస్యలు ఉత్పన్నమవుతాయని యూరియా పరిశ్రమలో పనిచేసిన సాంకేతిక నిపుణులు పేర్కొంటు న్నారు. తెలంగాణలో యూరియా కొరత తీవ్రమవడం, రైతులు రోడ్ల మీదకు వచ్చిన పరిస్థితుల్లో తెలంగాణ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. పార్లమెంట్‌లో వాయిదా తీర్మాణం కూడా పెట్టారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శి ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పునరుద్ధరణపై సమీక్ష జరుపుతున్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ సీఎండీ శర్వానంద్ బుధవారం ఢిల్లీ నుంచి ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు చేరుకుని అధికారులతో సమీక్ష జరిపారు. మరోవైపు ఆర్‌ఎఫ్‌సీఎల్ పరిశ్రమల ఉత్పత్తిని పునరుద్ధరించి తెలంగాణకు నిర్దేశించిన కోటాను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తుంది. ఆర్‌ఎఫ్ సీఎల్‌లో ఉత్పత్తికి మరింత జాప్యం ఏర్పడితే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో యూరియా కొరత తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆర్‌ఎఫ్‌సీఎల్ కేంద్ర కార్యాలయం రామగుండంకు తరలించి యుద్ధప్రాతిపదికన నిర్ణయాలు తీసుకుంటేనే ఆర్‌ఎఫ్‌సీఎల్ సాంకేతిక ఇబ్బందుల నుంచి బయటపడే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది.



ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రాజెక్టులోని హెచ్‌టీఆర్

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల గోదావరి లోకి వరద ఉధృతి పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. ధర్మపురి పట్టణంలోని మంగళి గడ్డ స్నానఘట్టం వద్ద నుంచి పెరుగుతున్న గోదావరివరదను పరిశీలించారు. అనంతరం మంత్రి లక్ష్మణ్ కుమార్ అధికారులతో మాట్లాడుతూ భారీవరదల నేపథ్యంలో గోదావరినదికి స్నానాలు చేసేందుకు వచ్చేభక్తులు లోపలికి వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షితప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ సిబ్బందిని అప్రమత్తంచేస్తూ నిత్యం అందుబాటులో ఉండేలాచర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తేచర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, ఎంపీడీవోరవీందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు ఉదయ్ కుమార్, రవికుమార్, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్ ఉన్నారు.



గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ఉమ్మడిజిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శిగా అనూప్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా కళాశాలల క్రీడాసమాఖ్య అండర్-19 కార్యదర్శిగా కొడిమ్యాల మోడల్‌స్కూల్, కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ డి అనూప్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి గంగాధర్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యదర్శిగా నియామకమైన అనూప్ రెడ్డికి బుధవారం నియామకపత్రాన్ని అందజేశారు. 2025-26విద్యాసంవత్సరానికి ఉమ్మడి జిల్లా కళాశాలల క్రీడాసమాఖ్య కార్యదర్శిగా అనూప్‌రెడ్డి బాధ్యతలను నిర్వహిస్తారని డీఐఈవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కళాశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే క్రీడాపోటీలను ఘనంగా నిర్వహించాలని అనూప్ రెడ్డికి డీఐఈవో సూచించారు. ఈసందర్భంగా అనూప్ రెడ్డిని ఉమ్మడి జిల్లాలోని పలువురు ఫిజికల్ డైరెక్టర్లు అభినందించారు.



అనూప్ రెడ్డి

బాలసాహితీవేత్త 'కందేపి'కి తెలుగు భాషా కీర్తి పురస్కారం

సిరిసిల్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన బాల సాహితీవేత్త డాక్టర్ కందేపి రాణి ప్రసాద్ తెలుగుభాషా కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు భాష, సంస్కృతి, వైభవం, సాహిత్యం, కళల పరిరక్షణ కోసం నిరంతరాయంగా కృషిచేస్తున్న అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఏటా అందించే తెలుగు భాషా కీర్తిపురస్కారాన్ని 2025 సంవత్సరానికి అందిస్తున్నట్లు చైర్మన్ కత్తిమండ ప్రతాప్ బుధవారం ప్రకటించారు. ఈనెల 31న గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆంధ్రాలోని పల్నాడుజిల్లా నరసరావుపేటలో నిర్వహించే తెలుగుభాషా దినోత్సవంలో రాణిప్రసాద్‌కు పురస్కారాన్ని అందించనున్నారు. అనేక కొత్త ప్రయోగాలు చేసి, బాలల మానసిక, వైజ్ఞానిక వికాసం కోసం డాక్టర్ కందేపి రాణిప్రసాద్ చేస్తున్న అవిరళ కృషిని గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. రాణిప్రసాద్ గత 35సంవత్సరాల్లో 55పుస్తకాలు రచించారు. బాలసాహిత్యంలో వైజ్ఞానిక రచనలు అంశంపై పీహెచ్‌డీ చేశారు. అవార్డుకు ఎంపికైన రాణిప్రసాద్‌ను మానేరు రయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, జిల్లా రయితల సంఘం కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.



డాక్టర్ కందేపి రాణిప్రసాద్

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని శృతిక జాతీయ స్థాయి వాలీ బాల్ పోటీలకు ఎంపికైందని హెచ్ఎం మధుమాలతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 19వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-15 విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో శృతిక, అశ్లేషలు పాల్గొన్నారని పేర్కొన్నారు. శృతిక ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. ఈనెల 26, 27 తేదీల్లో మహారాష్ట్రలోని పూణేలో బాలేవాడీ మైదానంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థిని శృతిక పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థిని ఎంపిక పట్ల పీడీ అక్బర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



శృతిక

తపాలా ఉద్యోగులకు వేతన సంఘాన్ని ఏర్పాటు చేయండి

● తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

ఓదెల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తపాలా ఉద్యోగులకు 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ (సి) రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ కోరారు. బుధవారం పొత్కపల్లి, ఓదెల తపాలా కార్యాలయాల వద్ద భోజన విరామం సమయంలో తపాలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్ల ప్రతులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ నేటి వరకు 8వ వేతన కమిటీని నియమించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్లు తీవ్ర ఆందోళనకు, నిరాశకు గురతున్నారని తెలిపారు. 2026 జనవరి ఒకటి నుంచి చెల్లించాల్సిన నూతన వేతనాలకు ఇప్పటివరకు వేతన సంఘం చైర్మన్, సంఘ సభ్యులను నియమించక పోవడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, సేవలన్నింటినీ కేంద్ర ప్రభుత్వ ఉద్యగులు ప్రజలకు త్వరగా పారదర్శకంగా అందిస్తున్నప్పటికీ ఉద్యోగుల వేతన సవరణ విషయం లో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం బాధాకరమని అన్నారు. జనవరి ఒకటి నుంచి నూతన వేతనాలు అందించాలని అలాగే గ్రామీణ తపాలా ఉద్యోగులను 8వ వేతన సంఘంలో చేర్చాలని అన్నారు. పెన్షనర్లకు యధావిధిగా పెన్షన్లు అందచేయాలని కోరారు. అలాగే పాత పెన్షన్ ప్రకారం ప్రయోజనాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపాల ఉద్యోగులు ఉస్మాన్, ముత్తయ్య,వెంకటేష్, సాయిరాం, రఘు, రిషిక, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



డిమాండ్ల ప్రతులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

'గాయత్రి' నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

● ఎస్సారెస్పీతో కలిపి 19,150క్యూసెక్కుల నీరు మిడ్ మానేరుకు తరలింపు

రామడుగు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఇంత వరకు మూడు, నాలుగు పంపుల ద్వారా మిడ్‌మానేరుకు నీటిని తరలిస్తున్న అధికారులు ప్రస్తుతం ఎస్సారెస్పీనుంచి నీరు వస్తున్న నేపథ్యంలో మంగళవారం ఒక్క పంపునకు కుదించారు. అయితే బుధవారం కూడా ఒక్కపంపు ద్వారా 3150 క్యూసెక్కుల నీరు పంపుహౌస్ నుంచి వరద కాలువకు తరలివెళ్తోంది. అలాగే ఎస్సారెస్పీ నుంచి 16వేల క్యూసెక్కుల నీరు వరదకాలువలో చేరుతోంది. దీంతో ప్రస్తుతం వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు 19,150 క్యూసెక్కుల నీరు తరలివెళ్తోంది. ప్రస్తుతం ఎస్సారెస్పీప్రాజెక్టు నుంచి వరద కాలువకు నీటి ప్రవాహం పెరుగు తుండగా ఇంకా పెద్ద మొత్తంలో ఇక్కడికి నీరు వచ్చేఅవకాశం ఉండడంతో అధికారులు గాయత్రి పంపుహౌస్‌లో పంపులను తగ్గించారు. ప్రస్తుతం గాయత్రి పంపుహౌస్ నుంచి 3150, ఎస్సారెస్పీ నుంచి 16 వేల క్యూసెక్కుల నీరు వరద కాలువకు చేరుతోంది. రెండువైపులా వచ్చి 18,150 క్యూసెక్కుల నీటిని మిడ్‌మానేరుకు తరలిస్తున్నారు. వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు నీరు తరలివెళ్లడంతో వరద కాలువ నిండుకుండలా తయారవడంతో రైతుల కళ్లలో ఆనందం కదలాడుతోంది. ఖరీఫ్ గట్టెక్కుతుందనే నమ్మకంలో ఉన్నారు.



గాయత్రి పంపుహౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

సిరిసిల్ల వద్ద మానేరు పరవళ్లు

● ఎగువ మానేరు ప్రాజెక్టు నుంచి 9734 క్యూసెక్కుల వరద నీరు
● మిడ్ మానేరు ప్రాజెక్టులోకి గోదావరి జలాలు

సిరిసిల్ల ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మానేరు వాగు పరవళ్లు తొక్కుతోంది. జిల్లాలోని గంభీరావుపేట మండలం నర్మాల ప్రాజెక్టులోకి కూడెల్లి, పాల్వంచ వాగుల నుంచి భారీగా వరద నీరు చేరి మత్తడి దూకుతోంది. ప్రాజెక్టు నుంచి మానేరు వాగులోకి 9734 క్యూసెక్కుల వరదనీరు పరవళ్లు తొక్కుతూ మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి చేరుతోంది. బుధవారం మానేరు జలకళను చూడడానికి సిరిసిల్ల ప్రజలు వాగు వద్దకు తరలివచ్చారు. మానేరు జలాలకు పూజలు చేశారు. ఎగువ మానేరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 9734 క్యూసెక్కులు కొనసాగుతోంది. జిల్లాలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులో 27.55 టీఎంసీలకు 14.89 టీఎంసీలకు చేరుకుంది. మిడ్‌మానేరు ప్రాజెక్టుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు వరద కాలువ ద్వారా 13802 క్యూసెక్కులు నీళ్లు వస్తుండగా, మానేరు, మూలవాగు వరదనీరు 200 క్యూసెక్కులు చేరుతుంది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 17152 ఉండగా, అన్నపూర్ణ ప్రాజెక్టుకు అవుట్ ఫ్లో 3310 క్యూసెక్కులు కొనసాగుతోంది.



జలకళ సంతరించుకున్న మానేరు వాగు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామి వారి దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు

వేములవాడ రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసం సందర్భంగా ధర్మగుండంలో స్నానాలు ఆచరించిన భక్తులు తలనీలాలు సమర్పించి క్యూలైన్ల ద్వారా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కులను చెల్లించుకున్నారు. కాగా, రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలోని సీతారామచంద్ర స్వామివారికి బుధవారం పునర్వసునక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజన్న ఆలయ హుండీ లెక్కింపు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి హుండీ ఆదాయాన్ని బుధవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో లెక్కించారు. 34రోజులకు హుండీ ఆదాయం కోటి 97లక్షల 54 వేల 588రూపాయలు, 170 గ్రాముల బంగారం, 10కిలోల 300గ్రాముల వెండి సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. ఈవో రాధాబాయి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. కార్యాలయ పరిశీలకులు, ఏసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి

-మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ -జిల్లావ్యాప్తంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు





జగిత్యాలలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మెట్‌పల్లి పట్టణంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, రాయికల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డిలు అన్నారు. బుధవారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో రాజీవ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువతకు ఓటు హక్కును 18 సంవత్సరాలకు కల్పించారని గుర్తు చేశారు. రాజీవ్‌ను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందడుగు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయ లక్ష్మీ, కాంగ్రెస్ మహిళా విభాగం నాయకురాలు పిప్పరి అనిత, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కంటాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలోని నంది చౌక్ వద్ద మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పలువురు కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరవలేమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, కాంగ్రెస్ నాయకులు సింహరాజు ప్రసాద్, ఆశెట్టి శ్రీనివాస్, రాపర్తి సాయికుమార్, నేదునూరి శ్రీధర్, కాశెట్టి రాజేష్, చిటనోజి రమేష్, గాజు సాగర్,తదితరులు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని జువ్వాడి భవనంలో బుధవారం కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర దేవాలయ ఛైర్మెన్ ఎతిరాజం నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు పెరుమాండ్ల సత్యనారాయణ, కొంత రాజం, తిరుమల గంగాధర్, గడ్డం వెంకటేష్ గౌడ్, మేకల నర్సయ్య, ఏలేటి మహిపాల్ రెడ్డి, ఎంబేరి నాగభూషణం, శ్రీరాముల అమరేందర్, చిట్యాల లక్ష్మినారాయణ, సదుల వెంకటస్వామి, ఎడ్ల రమేష్, ముక్కెర లింబాద్రి, ముల్క ప్రసాద్, రియాజ్ పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి టౌన్:** పట్టణంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కోమిరెడ్డి అజాద్‌ల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. రాజీవ్ గాంధీ విగ్రహంకు పూలమాల వేసి నివాళ్ళను అర్పించారు. పీసీసీ డెలికేట్ సుచిత్ రావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కూన గోవర్ధన్, నాయకులు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, సురేష్, వెంకటేష్, అందే మారుతి, పరుశురాం, సల్మాన్ ఖాన్, సమీర్ సర్కార్, కోయలక్కర్ చిరంజీవి, చరణ్, అడ్డూరి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

●**రాయికల్:** రాజీవ్‌గాంధీ జీవితం ఆదర్శనీయమని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్‌గౌడ్ అన్నారు. రాయికల్ పట్టణంలోని గాంధీ చౌరస్తాలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, కొయ్యడి మహిపాల్ రెడ్డి, బాపురపు నర్సయ్య, తలారి రాజేష్, మండ రమేష్, వాసం దిలీప్, తాటిపాముల రవి, రాజు, గోపాల్, రవి గౌడ్, మురళి, దాసరి రవీందర్, బొమ్మకంటి నవీన్, ఎనుగంటి రవి ఎండీ షాకీర్ పాల్గొన్నారు.

●**కథలాపూర్:** మండల కేంద్రంలో బుధవారం మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ భారత దేశంలో సాంకేతిక విప్లవం తెచ్చి మహా నాయకుడని పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీ పడేలా ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశారని అన్నారు. 18 సంవత్సరాలకు యువత ఓటు హక్కు వినియోగించుకునేలా సంస్కరణలు చేపట్టారని అన్నారు. మహిళా అభ్యున్నతి కోసం రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. రాజీవ్‌గాంధీ చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, పులి హరిప్రసాద్, జవ్వాజి రవి, సత్యనారాయణ, తలారి మోహన్, కూన అశోక్, అంబటి రాధాకృష్ణ, రాజు తదితరులు ఉన్నారు.

●**సారంగాపూర్:** మండల కేంద్రంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోండ్ర రాంచందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆసాది హరీష్, ప్రధాన కార్యదర్శి చేకుట శేఖర్, నాయకులు ఎండీ ఇబ్రాహీం, సత్యంరెడ్డి, కొక్కు ఉపేందర్, మైపాల్‌రెడ్డి, బాదినేని లక్ష్మీనారాయణ, బేర మహేష్, జలెందర్, అశోక్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను మల్లాపూర్ మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సద్భావన యాత్ర మొదలు పెట్టింది రాజీవ్‌గాంధీ అని, పారిశ్రామిక విప్లవాన్ని తీసుకొచ్చి కంప్యూటర్‌ను పరిచయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ఆయన దేశం కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, లచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రమొహన్‌రెడ్డి నాయకులు వినోద్‌రెడ్డి, ప్రసాద్, రాజనర్సు, గంగన్న, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**మల్యాల:** దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు మల్యాలలోని సోనియా గుడి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేశారు. రాజీవ్ చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, శనిగారపు తిరుపతి, నాగులపేట సంజీవ్, గాజుల అజయ్‌గౌడ్, వీరబత్తిని ప్రసాద్, మ్యాక లక్ష్మన్, నల్లపు మల్లేశం, బోగ రాజు, ప్రశాంత్, అనిల్ పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** పెగడపల్లి మండలంలో బుధవారం మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రధానిగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మార్కెట్ ఛైర్మన్ బుర్ర రాములు గౌడ్, నాయకులు ఒరుగల శ్రీనివాస్, సత్తిరెడ్డి, కడారి తిరుపతి, చెట్ల కిషన్, విజయ భాస్కర్, ఆకుల విష్ణు, అమిరిశెట్టి లక్ష్మినారాయణ, బండారి శ్రీనివాస్, తడగొండ రాజు, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

●**బీమారం:** బీమారం మండల కేంద్రంలో బుధవారం మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నాయకులు నీరటి మల్లేశం, ఉరుమట్ల లక్ష్మణ్, తోకల నర్సయ్య, ఉమ్మడి రవి, దాసరి గణేష్, సురకంటి రాజిరెడ్డి, ముంజ కిషన్, ఎండీ సయ్యద్, బూరం అరుణ్, చెక్కపెల్లి శంకర్, చెక్కపెల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్, పిడమల్ల గంగాధర్, కొత్తపల్లి అజయ్, అంగడి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెల్గటూర్‌లో అంబేడ్కర్ కూడలి వద్ద మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుండాటి గోపిక జితేందర్ రెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ పూదరి రమేష్, వైస్ ఛైర్మన్ గొల్ల తిరుపతి, మెరుగు మురళి, గండ్ర శ్రీకాంత్ రావు, నందయ్య, బండెల ఉదయ్, రంగు తిరుపతి. మెరుగు నరేష్, హరీష్, శ్రీనివాస్, గాజుల విజయ్, కూస లక్ష్మణ్, రవి, పోచయ్య పాల్గొన్నారు.



మల్యాలలో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఫసల్ బీమా లేనట్లే..!

(ఐదో పేజీ తరువాయి)

రైతులకు కొంత భరోసా ఉండేది. కానీ ఇప్పటి వరకు ఫసల్ బీమా పథకం అమలుపై ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. దీంతో ప్రస్తుత వానాకాలం సాగు సీజన్‌లోనూ పథకం అమలు అయ్యే అవకాశం లేదని స్పష్టమవుతోంది.

మార్గదర్శకాలు రాలేదు

-భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి



ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఫసల్ బీమా పథకం అమలుకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ఫసల్ బీమా పథకం అమలు చేయాలని రైతులు అంటున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే రైతులకు సమాచారం అందిస్తాం.

మద్యం మత్తులో యువకుల దాడి

-హోంగార్డుకు గాయాలు

కోరుట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కోరుట్ల పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి పోలీసులపై యువకులు దాడి చేయడంతో హోంగార్డుకు గాయాలయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి సమయంలో పట్టణంలోని తాళ్ళ చెరువు ప్రాంతంలో మద్యం సేవించి యువకులు హంగామా చేస్తున్నారని కాలనీ వాసులు 100 నంబర్‌కు స్థానికులు ఫిర్యాదు చేసారు. దీంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది గంగాధర్, హోంగార్డు జహీద్ అక్కడి వెళ్లారు. వారిని చూడగానే కొంతమంది యువకులు వాహనాలపై పరారయ్యారు. అక్కడున్న యువకులను పోలీసులు ప్రశ్నిస్తుండగా వారు వాగ్వాదానికి దిగారు. దీంతో గంగాధర్ వారిని సముదాయించే ప్రయత్నం చేశాడు. మద్యం మత్తులో ఓ యువకుడు గంగాధర్‌పై దాడి చేయడానికి ప్రయత్నించంగా హోంగార్డు జహీద్ అడుకున్నాడు. దీంతో కోప్రోద్రుడైన యువకులు హోంగార్డు జహీద్‌పై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకొని హోంగార్డు జహీద్‌ను చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. పట్టణంలోని ఐబీ రోడ్డుకు చెందిన షేక్‌యాసిన్ అనే వ్యక్తి దాడి చేసినట్లు గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

తల్లీకొడుకు అదృశ్యం

మల్యాల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): భర్తతో మనస్పర్థలు ఏర్పడి తల్లిగారి ఇంటిలో ఉంటున్న ఓ వివాహిత ఏడాదిన్నర కొడుకుతో అదృశ్యమైనట్లు మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మల్యాలకు చెందిన ఆలకుంట పూజకు కరీంనగర్ మండలం వడ్డపల్లికి చెందిన ఆలకుంట చందుతో రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కొడుకు కాగా ఏడాది క్రితం మనస్పర్థలు రావడంతో కొడుకుతో తన తల్లిగారింటి వద్ద ఉంటోంది. మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా కొడుకుతో కలిసి పూజ వెళ్లిపోయింది. దీంతో కుటుంబసభ్యులు పలు చోట్ల వెదికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం ఆమె తల్లి గండికోట సాయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దంపతుల అదృశ్యం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బోడ రవి(50), బోడ ప్రమీల (45) అనే దంపతులు అదృశ్యమైనట్లు ఎస్ఐ అనిల్ బుధవారం తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన బోడ రవి దంపతులు ఈనెల 16న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, వారి కూతురు మీనాక్షి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ తెలిపారు.

'గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

వెల్గటూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కోటిలింగాల వద్ద గోదావరిలో వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో కృపాకర్, ఎస్సై ఉమాసాగర్ సూచించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం అధికారులు, నాయకులు గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. వరద తీవ్రత ఎక్కువగా ఉండడంతో స్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా తగు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్లను నియమించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుండాటి గోపిక జితేందర్ రెడ్డి. ఆలయ కమిటీ ఛైర్మన్ పూదరి రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గొల్ల తిరుపతి, నాయకులు మెరుగు మురళి, రంగు తిరుపతి. గండ్ర శ్రీకాంత్ రావు, బండెల ఉదయ్, మెరుగు నరేష్, రమేష్, విజయ్, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

జగిత్యాల క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణీపేటలో ఉన్న శ్రీ లోకమాత పోచమ్మ తల్లి ఆలయ 63వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుడు విష్ణు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి ఎదుట 108 కళాశాలను ఏర్పాటు చేశారు. 108 మంది దంప తులు హాజరై పవిత్ర గోదావరి జలాలతో అభిషేకాలు నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గాజుల రాజేందర్, రాజగోపాల చారి, రాఘవచారి, గంగాధర్, చంద్ర ప్రకాష్, మునీందర్, హరికృష్ణ, సత్యజిత్, ప్రవీణ్, భద్రయ్య తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

జగిత్యాల క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కోరుట్లకు చెందిన రఘు, జగిత్యాలకు చెందిన లక్ష్మణ్‌లు సెల్‌ఫోన్లు పోగొట్టుకోగా పోలీసులు ప్రత్యేక యాప్ ద్వారా గుర్తించారు. బాధితులకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ కరుణాకర్ చేతుల మీదుగా సెల్‌ఫోన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఉన్నారు.

రహదారిపై నీరు నిలువకుండా చర్యలు

వెల్గటూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో మండలంలోని రాజక్కపల్లి వద్ద ఏడవ నంబరు రాష్ట్ర రహదారిపై నీరు నిలుస్తుండడంతో అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్డుపై నిలుస్తున్న నీటిని ఎక్స్‌కావేటర్ సహాయంతో మురుగు నీటి కాలువ ద్వారా వెళ్లేలా చేశారు. ఇరిగేషన్ ఏఈ వెంకట్, ఆర్‌అండ్‌బీ ఏఈ భరద్వాజ్‌లు రోడ్డు వద్ద పరిస్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ పత్తిపాక వెంకటేష్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోరుట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికుల పిల్లల ఉపకార వేతనాలకు రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీపీఐ నాయకులు తెలిపారు. బుధవారం పట్టణంలోని సి.ప్రభాకర్ భవనంలో ఏర్పాటు చేసిన బీడీ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. ఒకటి నుంచి పది తరగతి చదివే విద్యార్థులు ఆగస్టు 31, ఇంటర్ ఆపై చదివే విద్యార్థులు అక్టోబర్ 31 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుతారి రాము తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీవో సలీం సూచించారు. మండలంలోని వేముల కుర్తి గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనం కొరకు పాఠశాల ఆవరణలో పెంచుతున్న కిచెన్ గార్డెన్ చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పెంట లింబాద్రి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

పలువురికి పీహెచ్‌డీ ప్రదానం

రాయికల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన పబ్బోజి విజయలక్ష్మి మంగళవారం హిందీ విభాగంలో డాక్టరేట్ పట్టాను సాధించింది. హైదరాబాద్‌లో ఉస్మానియా విశ్వ విద్యాలయం 84వ స్నాతకోత్సవ సభ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేశ్ శర్మ, ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణల చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకుంది. ప్రొఫెసర్ చంద్రముఖి పర్యవేక్షణలో 'ఎక్కి నవి నదికే మహిళా ఉపన్యాస్కా రొంకే ఉపన్యాసో మే నారీవాది చేతన' అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను ఉస్మానియా విశ్వ విద్యాలయ అధికారులు విజయలక్ష్మికి పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేశారు.

●**సారంగాపూర్:** సారంగాపూర్ మండంలోని రంగపేట వాసికి డాక్టరేట్ పట్టా లభించింది. ఉస్మానియా యూనివర్సిటీలో 84 స్నాతకోత్సవాల్లో ఇస్రో ఛైర్మన్ నారాయణ, యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. జువాలాజీ విభాగంలో కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ వన్య ప్రాణుల మీద చేసిన పరిశోధనలకు గాను ఈ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు.

'యూరియా పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం'

మల్లాపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా పంపిణీలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని బీజేపీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకు అవసరమైన యూరియా 9.87లక్షల మెట్రిక్ టన్నులు కాగా కేంద్ర ప్రభుత్వం 12.47 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసిందన్నారు. అందులో 10.43 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం యూరియా విక్రయించిందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ముందుగానే స్టాక్ లేదని అబద్ధాలు చెప్పడంతో రైతులు భయంతో యూరియా కోసం షాపుల వద్దకు వెళ్తున్నారన్నారు. ఇదే అదనుగా దళారులు యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించిండంతో రాష్ట్రంలో కృత్రిమ కొరత ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పీసు రాజేందర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాలయ వార్షికోత్సవం

కథలాపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గుంటి పెరుమాళ్ళ సన్నిదానం సమీపంలో నిర్మించిన రామాలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగాయి. వేదపండితులు పులికాంత ప్రమోద్ ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ ఇట్టెడి సంజీవ్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, మాజీ ఛైర్మన్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు కృషి



బోధనోపకరణాలను పరిశీలిస్తున్న డీఈవో రాము

వెల్గటూర్, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బోధనోపకరణాలను ఉపయోగించి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల మెరుగునకు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రాము సూచించారు. బుధవారం వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్ఎం మేళా ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు సృజనాత్మకంగా తయారు చేసిన బోధన అభ్యసన పరికరాలను జిల్లా విద్యాధికారి రాము పరిశీలించి తర గతి గదిలో వాటి వినియోగం తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానానికి సంబంధించిన బోధనోపకరణాలను ఉపయోగించి బోధిస్తూ జిల్లాను విద్యారంగంలో అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడి మీద ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ ఆఫీసర్ కొక్కుల రాజేష్, మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు నందయ్య, ఆర్పీలు సంపత్, మహేష్, రమాదేవి, సాగర్, సత్తయ్య, శ్రీనివాస్ ఉపాధ్యాయులు గంగరాజు, ఆగమయ్య, రవీందర్, అనిల్, సీఆర్పీలు వెంకటేష్, రజిని పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ధర్మపురి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని దొంతాపూర్-మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భరోసా, షీ టీమ్, ఏహెచ్‌టీయు టీమ్, పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో నూతన చట్టాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ధర్మపురి ఎస్ఐ రవీందర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. మహిళలు, బాలికల రక్షణ కోసం షీ టీమ్, ఏహెచ్‌టీయు టీమ్ ఎల్లప్పుడు సిద్దంగా ఉన్నాయని ఆయన తెలిపారు. విద్యార్థినులు సామాజిక మాధ్యమాల వినియోగంలో ప్రత్యేక జాగ్రతలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతను కాపాడుకోవాలని ఆయన సూచించారు. మహిళలకు, పిల్లలకు నూతన చట్టాలు మరింత అండగా, రక్షణగా నిలుస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

రాయికల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రానున్న వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. రాయికల్ పట్టణంలో బుధవారం వినాయక ఉత్సవాల నిర్వహణపై మండపాల నిర్వాహకులతో పద్మశాలి కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండపాల నిర్వహణకు సంబంధించిన సమాచారం కోసం రూపొందించిన వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరచాలన్నారు. దీని ద్వారా భద్రత, బందోబస్తు చేయడానికి ఏర్పాటు చేయడానికి పోలీసులు సులువుగా ఉంటుందన్నారు. ప్రజా రవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు లేకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మండపాల నిర్వాహకులు బాధ్యత వహించాలని అన్నారు. డీజేలు, ఎక్కువ సౌండ్ కలిగిన బాక్స్‌లు పెట్టరాదని అన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించుకోవాలని అన్నారు. వస్తువులు లేదా అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ శోభాయాత్రను నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ సుధాకర్, రాయికల్ ఎస్సై సుధీర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడిమ్యాల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిర్మలాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు బుధవారం విద్యుత్ శాఖ ఏఈఈ రఘునాథ్ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో గల తిర్మాలాపూర్, నూరంపేట, కోనాపూర్, దమ్మయ్యపేట, హిమ్మతురావుపేట, డబ్బుతిమ్మయ్యపల్లి, రాంసాగర్, శనివారంపేట, గంగారాం తండా గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భూ తగాదాలో కేసు

మల్యాల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టులోని పెట్రోల్‌బంక్ సమీపంలోని ఓ భూతగాదా సంఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముత్యంపేటకు చెందిన బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌కు చెందిన భూమి హద్దులకు సంబంధించి జగిత్యాలకు చెందిన మెన్నేని అనంతరాజశేఖర్‌కు వివాదం ఉంది. కాగ అనంతరాజశేఖర్ బుధవారం మధ్యాహ్నం శ్రీనివాస్‌గౌడ్ భూమిలోని హద్దురాళ్ల తొలగించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అనంతరాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇదే సంఘటనలో మెన్నేని అనంతరాజశేఖర్ కూడా బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌పై ఫిర్యాదు చేయగా దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

ధర్మపురి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని కొసునూర్‌పల్లె గ్రామంలో పోచమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు మదు నటరాజ్‌శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు పోచమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొసునూర్‌పల్లె మాజీ సర్పంచ్ ఎన్నం లక్ష్మారెడ్డి, జైనా మాజీ ఎంపీటీసీ కుక్కల గంగారెడ్డి, జైనా పీఏసీఎస్ ఛైర్మన్ సౌళ్ల నరేష్, వైస్‌ఛైర్మన్ మూల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.